క్లుప్తంగా

ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

అల్విన్‌కాలనీ: బీఆర్‌కే ఆయుర్వేదిక్ ప్రభుత్వ ఆస్పత్రి ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపును వీర మల్ల కేశవరావు సహకారంతో మంగళవారం పీజేఆర్ నగర్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శేరిలింగంపల్లి అసెంబ్లీ నాయకులు గజ్జల యోగానంద్, ఎల్ నరేందర్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, రామరాజు, కమలాకర్‌రెడ్డి, నవీన్, ఆర్కే చారి, రఘు, రాజులు పాల్గొన్నారు. డాక్టర్ మాధవరావు బృందం పర్యవేక్షణలో సుమారు 250 మందికి పైగా పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

అభినందనలు



గోల్డ్ మెడల్ సాధించిన తిరుపతిరావును సన్మానించిన కార్పొరేటర్ సబిహా బేగం

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పర్వత్‌నగర్ కమిటీహాల్‌లో కార్పొరేటర్ సబిహా బేగం పవర్ లిఫ్టింగ్ చాంపియన్స్ డిస్ట్రిక్ట్ లెవెల్‌లో గోల్డ్ మెడల్స్ సాధించిన ఈగల తిరుపతిరావుకు తెలంగాణ స్టేట్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఇంటూరి రేఖలను మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... పర్వత్‌నగర్‌కు చెందిన కార్యకర్త ప్రసాదరావు కుమారుడు తిరుపతిరావు మరెన్నో పతకాలు సాధించాలని నేషనల్ లెవెల్‌కు వెళ్తున్న సందర్భంగా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కోఆర్డినేటర్ వీరారెడ్డి, పర్వత్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాహెద్ షరీఫ్ బాబా, రాజారావు, వంశీప్రసాద్, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పటాన్‌చెరు టౌన్: అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ సబ్జెక్టులో 1 గెస్ట్ ఫ్యాకల్టీ కొరకు దరఖాస్తు ఆహ్వానిస్తున్నామని, అప్లై చేసుకునే అభ్యర్థులు, పీజీ కామర్స్ (పోస్ట్ గ్రాడ్యుయేషన్)లో 55 శాతం మార్కులు పొంది ఉండాలని ,నెట్ ,పీహెచ్‌డి ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. అభ్యర్థులు సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలతో 12 వ తేదీ గురువారం సాయంత్రం నాలుగు గంటల లోపు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో, 13వ తేదీ ఉదయం 10 గంటలకు, తారా ప్రభుత్వ కళాశాల సంగారెడ్డిలో ఇంటర్వ్యూ (మౌఖిక పరీక్ష)కు హాజరు కావాలన్నారు.

సంస్కృతికి కేరాఫ్ హైదరాబాద్

ప్రముఖ చరిత్రకారుడు ఐజాజ్ ఫరూఖ్

రాయదుర్గం: హైదరాబాద్ సంస్కృతికి సంబంధించిన నగరమని ప్రముఖ చరిత్రకారుడు ఐజాజ్ ఫరూఖ్ అభిప్రాయపడ్డారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో ముఖరంజా స్మారక ఉపన్యాస కార్యక్రమాన్ని సెంటర్ ఫర్ ఉర్దూ కల్చర్ స్టడీస్ (సీయూసీఎస్) ఐఎంసీ ప్రివ్యూ థియేటర్‌లో నిర్వహించారు. వీసీ సయ్యద్ ఐనుల్ హసన్ మాట్లాడుతూ హైదరాబాదీ సంస్కృతిని దక్కనీ భాష, కవిత్వం గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. అంతకు ముందు రెండు పుస్తకాలతోపాటు కేంద్రం ప్రచురించిన రెఫర్డ్ జర్నల్ 'అదాబ్-ఓ-సకాఫత్' తాజా సంచికను ఆవిష్కరించారు.

హెచ్‌సీయూ సమస్యలు పరిష్కరించాలి

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలిపారు. హెచ్‌సీయూలోని పరిపాలనా భవనం ముందు ఏబీవీపీ హెచ్‌సీయూ అధ్యక్షుడు అక్షయ్, కార్యదర్శి ఆకాష్ మాట్లాడుతూ హెచ్‌సీయూలో అకడమిక్ విభాగంలో 5 డిమాండ్లు, మౌలిక వసతుల కల్పనలో 4 డిమాండ్లు, యూనివర్శిటీ పరిపాలనలో 6 డిమాండ్లను తీర్చి విద్యార్థులకు సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు.

13న హెచ్‌సీయూ స్నాతకోత్సవం

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ 23వ స్నాతకోత్సవాన్ని 13వ తేదీ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఉదయం 11 గంటలకు గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లోని గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొ.బీజేరావు పర్యవేక్షణలో జరిగే ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ చైర్మన్ ప్రొఫెసర్ ఎం జగదీష్‌కుమార్, గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర్య రాజన్, హెచ్‌సీయూ చాన్స్‌లర్ జస్టిస్ ఎల్ నర్సింహారెడ్డి పాల్గొంటారు.

స్తంభాలకు కేబుళ్లు చుట్టొద్దు

అమీర్‌పేట: కాలనీల్లోని విద్యుత్ స్తంభాలకు ఇష్టానుసారంగా కేబుళ్లను చుట్టి ప్రజలకు ఇబ్బందులు కలిగించరాదని అమీర్‌పేట కార్పొరేటర్ సరళ అన్నారు. మంగళవారం ఆమె పలు ప్రాంతాల్లో పర్యటించి స్తంభాలకున్నా కేబుళ్లను చూసి సంబంధిత వ్యక్తులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేబుళ్లు ఎక్కువగా ఉంటుండడంతో కొన్ని సందర్భాల్లో విద్యుదాఘాతాలు సంభవిస్తున్నాయన్నారు.

కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఓటర్లు 4,47,536

ఇక్కడ అభ్యర్థుల గెలుపోటములను శాసించేది యువతే..

- నియోజకవర్గంలో 2లక్షలకు పైగా యువ ఓటర్లు
- గత 2నెలలుగా పాదయాత్రతో ప్రజలకు చేరువైన ఎమ్మెల్యే
- హ్యాట్రిక్ కొట్టేందుకు నియోజకవర్గంలో జోరుగా ప్రచారం
- పేరు ప్రకటించకపోయినా ప్రచారం చేసుకుంటున్న బీజేపీ, కాంగ్రెస్ నేతలు



కూకట్‌పల్లి: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత కూకట్‌పల్లి నియోజకవర్గం మూడోసారి ఎన్నికలకు సిద్ధమైంది. 2009లో పునర్విభజనలో భాగంగా ఏర్పడిన కూకట్‌పల్లి నియోజకవర్గం అప్పట్లో నాలుగున్నర లక్షల జనాభాతో ఉండేది. ఆ తరువాత ఎన్నికలు 2014లో 5.50 లక్షలకు జనాభా చేరుకుంది. ప్రస్తుతం నియోజకవర్గ జనాభా 6.50 లక్షలకు చేరింది. ఒకప్పటి కుగ్రామమైన కూకట్‌పల్లి ఆ తర్వాత మున్సిపాలిటీగా అవతరించి అనంతరం గ్రేటర్ హైదరాబాద్‌లో కలిసిపోయింది. అప్పటి బాలానగర్ మండలాన్ని ప్రతిపాదికగా తీసుకొని అందులోని 8 రెవెన్యూ గ్రామాలను కలుపుతూ ఓ నియోజకవర్గంగా ఏర్పాటు చేశారు. సుమారు 39.74 చదరపు కిలోమీటర్ల వైశాల్యంలో ఆవరించి యున్న ఈ ప్రాంతంలో జీహెచ్ఎంసీ డివిజన్లు 7 ఉన్నాయి. మరో 2 సగభాగంతో ఉన్నాయి.

◆ **2009 నుంచి ఇప్పటి వరకు...**

నియోజకవర్గంలో మొదటిసారి ఐఏఎస్ అధికారిగా పనిచేసిన జయప్రకాష్ నారాయణ సమీప ప్రత్యర్థి వడ్డేపల్లి నర్సింగారావుపై 14 వేల మెజార్టీతో విజయం సాధించారు. అనంతరం 2014లో టీడీపీ నుంచి పోటీ చేసిన మాధవరం కృష్ణారావు టీఆర్ఎస్ (ప్రస్తుతం బీఆర్ఎస్) అభ్యర్థిగా పోటీ చేసిన గొట్టిముక్కల పద్మారావుపై 40 వేల మెజార్టీతో విజయం సాధించారు. 2018లో మాధవరం కృష్ణారావు టీఆర్ఎస్ (ప్రస్తుతం బీఆర్ఎస్) తరఫున పోటీ చేసి రెండోసారి విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి అయిన నందమూరి సుహాసినిపై 41వేల మెజార్టీతో విజయం సాధించారు.

◆ 2009, 2014, 2018 ఎన్నికల్లో భారీ పరిణామాలు చోటు చేసుకున్నాయి. 2009లో సీమాంధ్ర ఓటర్లు దాదాపు 2 లక్షల వరకు ఉండేవారు. ఆ సమయంలో టీడీపీ రంగంలో లేనందున ఐఏఎస్ అధికారి జయప్రకాష్ నారాయణ వైపు ఓటర్లు మొగ్గు చూపారు. 2014లో కూడా ఓటర్లు టీడీపీ రంగంలో ఉండటంతో ఆంధ్రా ప్రాంతీయులు టీడీపీ వైపు మొగ్గు చూపారు. 2018లో తెలంగాణ రాష్ట్రంలో జరిగిన మొదటి ఎన్నికల్లో టీఆర్ఎస్‌కు ఓటర్లు జై కొట్టారు.

◆ **ఆధార్ లింక్‌తో 40శాతానికి తగ్గిన ఓటర్లు**

సీమాంధ్ర ప్రాంత ప్రజలతో పాటు తెలంగాణ జిల్లాల నుంచి వచ్చిన ప్రజలు ఇక్కడ ఎక్కువగా నివాసముంటున్నారు. గతంలో సీమాంధ్ర ఓటర్లు ఎక్కువగా ఉన్న కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఆధార్ లింక్‌తో 40 శాతం ఇతర రాష్ట్రాల ఓటర్లు తగ్గిపోయారు. ముఖ్యంగా ఇక్కడ నివాసముంటూ ఉద్యోగాలు చేసే వారు కూడా సొంత ఇళ్ల నిర్మాణంతో శివారు ప్రాంతంలో ఉన్న నియోజకవర్గాలకు వెళ్లటంతో ఇక్కడ ఓటింగ్ శాతం తగ్గిపోయింది. ప్రస్తుతం కూకట్‌పల్లి నియోజకవర్గంలో 4,47,536 ఓటర్లు ఉన్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.



◆ **అభివృద్ధికే విద్యావంతుల ఓటు..**

◆ 63 శాతం విద్యావంతులు ఉన్న ఈ నియోజకవర్గంలో పరిపూర్ణ ఆలోచనతో తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారని తెలుస్తుంది. అయితే ఒకప్పుడు నియోజకవర్గంలో శాంతి భద్రతలు, ఉన్నత చదువుకున్న నాయకుల కోసం ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేవారు. ప్రస్తుతం ఇక్కడి ఓటర్లు అభివృద్ధి, మార్పు పైన ఎక్కువగా శ్రద్ధ చూపుతున్నట్లు తెలుస్తోంది.

వయస్సు	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
18-19	3189	2696	0	5885
20-29	39767	36088	27	75882
30-39	71444	69269	65	140778
40-49	56806	49933	15	106754
50-59	33239	28862	4	62105
60-69	18107	16123	6	34236
70-79	9447	7528	2	16977
80-89	2241	1919	1	4161
90-99	317	390	0	707
100-109	21	28	0	49
110-119	1	0	0	1
120+	1	0	0	1
మొత్తం	234580	212836	120	4,47,536

వందేళ్లు పైబడిన ఓటర్లు 51మంది

ఇదిలా ఉండగా 100 సంవత్సరాలకు పైబడిన వారు నియోజకవర్గంలో 51 మంది ఉన్నారు. వృద్ధాప్య పించన్‌కు అర్హులైన వారే సుమారు 60 వేల మంది వరకు ఉన్నారు. ఇవి కాకుండా అందులో వికలాంగులు 5,444 మంది ఉన్నారు.

యువ ఓటర్లే అత్యధికం..

ప్రస్తుతం నియోజకవర్గంలో కొత్త ఓటర్ల సంఖ్య భారీగా పెరిగింది. అందులో 20 - 29 వయస్సు ఉన్న ఓటర్లు 75, 882 మంది ఉన్నారు. 30 - 39 ఏళ్ల ఉన్నవారు 1,40,778 మంది ఉన్నారు. ప్రస్తుతం వీరు అభ్యర్థుల గెలుపోటములను నిర్ణయించే శక్తిగా ఉన్నారు. 40 నుంచి 49 సంవత్సరాల వయస్సు కలిగిన వారు మొత్తం 106754 మంది ఉన్నారు. అదే విధంగా కొత్తగా ఓటు వచ్చిన వారు 5,885 మంది ఉన్నారు.

గత ఎన్నికలో ఎమ్మెల్యే కృష్ణారావుకు 1.09లక్షల ఓట్లు...

గత ఎన్నికల్లో కూకట్‌పల్లి నియోజకవర్గంలో 2, 15, 369 ఓట్లు పోలయ్యాయి. అందులో మాధవరం కృష్ణారావుకు 1,09,119 ఓట్లు పోలయ్యాయి. ఆయన ప్రత్యర్థి నందమూరి సుహాసినికి 69, 526 ఓట్లు వచ్చాయి. స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన పన్నాల హరీష్‌రెడ్డికి 12,557 ఓట్లు వచ్చాయి. బీజేపీ అభ్యర్థి మాధవరం కాంతారావుకు 11,497 ఓట్లు వచ్చాయి.

రేపటి నుంచి బతుకమ్మ సంబురాలు

- 22వ తేదీన సద్దుల బతుకమ్మ



(ఫైల్ ఫొటో)

కూకట్‌పల్లి: బతుకమ్మ ఉత్సవాలను కూకట్‌పల్లిలో ఈనెల 12వ తేదీ నుంచి ఘనంగా నిర్వహించనున్నారు. కాంక్రీట్ జంగిల్‌గా మారిన కూకట్‌పల్లిలో అచ్చమైన పూలతో బతుకమ్మలను పేర్చే కూకట్‌పల్లి మహిళలు రాష్ట్రంలోనే అతి పెద్ద బతుకమ్మలను పేర్చి ప్రత్యేకతను సొంతం చేసుకున్నారు. బతుకమ్మ పండుగ కోసం లక్షల రూపాయలను వెచ్చించి మహిళలు పోటీతత్వంతో బతుకమ్మలను తయారు చేస్తారు. ఈసారి బతుకమ్మలకు అమావాస్యకు ముందు రోజు శుక్రవారం రావటంతో తొలి రోజు బతుకమ్మ బొడ్డెమ్మలను బయటకు తీసుకురావద్దనే సంప్రదాయం ఉంది. దీంతో గురువారమే బతుకమ్మ వేడుకలను ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా బతుకమ్మ వేడుకల కోసం కూకట్‌పల్లి అభివృద్ధి కమిటీ అన్ని ఏర్పాట్లను చేస్తున్నారు. కూకట్‌పల్లి ప్రధాన చౌరస్తా వద్ద ఏర్పాటు చేసే ఈ వేడుకలకు మహిళలు భారీ ఎత్తున పాల్గొననున్నారు. ఈ సందర్భంగా పోలీసు బందోబస్తును కూడా ఏర్పాటు చేయనున్నారు. ఈనెల 22వ తేదీన సద్దుల బతుకమ్మ నిర్వహించనున్నారు.

లిమ్కా బుక్ ఆఫ్ రికార్డులో డాక్టర్ గీతా చల్లా

గచ్చిబౌలి: మానసిక ఆరోగ్యంపై శిక్షణ, అవగాహన కల్పిస్తున్న మనో జాగృతి సంస్థ వ్యవస్థాపకురాలు డాక్టర్ గీతా చల్లాకు లిమ్కా బుక్ రికార్డ్స్‌లో చోటు లభించింది. 2023 లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ సర్టిఫికెట్‌ను రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి హరీష్‌రావు చేతుల మీదుగా అందుకున్నారు. కోవిడ్-19 విపత్కర పరిస్థితుల్లో ప్రజల్లో నెలకొన్న భయాందోళనలను నివృత్తి చేసేందుకు మానసిక ఆరోగ్యంపై 13 గంటల పాటు ఆన్‌లైన్‌లో అవగాహన నిర్వహించారు. వందకు పైగా మానసిక నిపుణులతో కలిసి 'మన పండుగలు-మానసిక ఆరోగ్యం'అనే అంశంపై అవగాహన కల్పించినందుకు భారత్ వరల్డ్ రికార్డ్ సంస్థ మరో సర్టిఫికెట్‌ను అందజేసింది. మంగళవారం కొండాపూర్ పోలీస్ బెటాలియన్‌లో తెలంగాణ స్పెషల్ పోలీస్ అడిషనల్ డైరెక్టర్ జనరల్ స్వాతి లక్రా భారత్ వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్‌ను డాక్టర్ గీతా చల్లాకు అందజేశారు. కార్యక్రమంలో భారత్ వరల్డ్ రికార్డ్ ప్రతినిధులు దేవేందర్ బండారి, బింగి నరేందర్ గౌడ్, కొండాపూర్ బెటాలియన్ కమాండెంట్ సన్నీ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి హరీష్‌రావు చేతుల మీదుగా సర్టిఫికెట్‌ను అందుకుంటున్న డాక్టర్ గీతా చల్లా

చిత్రప్రదర్శన ప్రారంభం



మాదాపూర్: మాదాపూర్ చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో మంగళవారం ఏర్పాటు చేసిన జోయస్ సర్క్యూట్ ఆఫ్ లైఫ్ పేరిట ఏర్పాటు చేసిన చిత్రప్రదర్శనను జెఎన్ఎఫ్ఏయూ వీసీ డాక్టర్ కవిత కళాకారులతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిత్రాలు సందేశాత్మకంగా ఉన్నాయని ప్రతి ఒక్కరిని ఆలోచింపజేస్తున్నాయని తెలిపారు. అక్టోబర్ 26వ తేదీ వరకు నిర్వహించనున్న ఈ ప్రదర్శనలో 52 చిత్రాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఉదయం 10గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.

'ఐఎస్‌బీ'లో పోస్టల్ దినోత్సవం

రాయదుర్గం: పోస్టుకార్డు, లెటర్ వంటివి గుర్తు చేసుకున్న వేళ'.. జాతీయ పోస్టల్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) ప్రాంగణంలో పోస్ట్ బాక్స్ వద్ద ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐఎస్‌బీ ప్రాంగణంలో విద్యార్థులు, ఫ్యాకల్టీ, ఇతర అధికారులు, ఉద్యోగులు దేశ నిర్మాణానికి పోస్టల్ రంగం సహకారాన్ని గుర్తించి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వారు పేర్కొన్నారు. ఐఎస్‌బీ యొక్క మౌలిక సదుపాయాలు, వృక్షజాలం, జంతు జాలం యొక్క అందం తదితరాలను వారికి ఇష్టమైన వారికి పంపించేలా ప్రత్యేకంగా రూపొందించిన పోస్ట్ కార్డులను అధ్యాపకులు, సిబ్బంది పోస్ట్ చేసి 'మెమోరీస్ ఇన్ మెయిల్' పేరిట నిర్వహించుకున్నారు.



సీఆర్ ఫౌండేషన్‌లో నైపుణ్య శిక్షణ కేంద్రం

హఫీజ్‌పేట్: కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్ నీలం రాజశేఖర్‌రెడ్డి రీసెర్చ్ సెంటర్‌లో మహిళలకు ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రం నిర్వహిస్తున్నారు. టైలరింగ్, ఎంబ్రాయిడరీ, మగ్గం,డైయింగ్,ప్రింటింగ్,బ్యూటిషియన్,స్పోకెన్ ఇంగ్లీష్, కంప్యూటర్, ట్యాలీ, డీటీపీ శిక్షణ ఇస్తున్నారు. మహిళలు మొదట అడ్మిషన్ కొరకు రూ.150లు చెల్లించాలి. సంవత్సరానికి నాలుగు బ్యాచ్‌లుగా,ఒకోక్క బ్యాచ్‌కు మూడు నెలల పాటు శిక్షణ ఉంటుంది. ఒక బ్యాచ్‌లో సుమారు 100 మంది మహిళలు ఉంటారు. 15 సంవత్సరాల వయస్సు నుంచి 35 సంవత్సరాల మధ్యలో గల చిన్నారులు, మహిళలు ఈ శిక్షణలో పాల్గొనవచ్చు. మరిన్ని వివరాలకు కన్వీనర్ వనశ్రీ ఫోన్ : 9246530048కు సంప్రదించగలరు.

ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్..

సీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. మహిళల, కుటుంబ సమస్యలు ఉంటే ప్రత్యేకంగా ఫ్యామిలీ కౌన్సిలింగ్ కూడా తీసుకోవచ్చు.

16 నుంచి శబరిమల మహా పాదయాత్ర

రాయదుర్గం: దివ్యజ్యోతి శబరిమల మహా పాదయాత్రను ఈనెల 16వ తేదీ నుంచి ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు, గురుస్వాములు ముత్యంరెడ్డి, మాణిక్‌రెడ్డి మంగళవారం తెలిపారు.నానక్‌రాంగూడలోని రంగనాథస్వామి ఆలయం వద్ద ఉదయం 7 గంటలకు పాదయాత్రను ప్రారంభించి నవంబర్ 22వ తేదీన శబరిమలలో ముగించేలా ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. ఈ సందర్భంగా మొత్తం 37 రోజుల పాటు సాగుతూ మొత్తం 1,134 కిలోమీటర్ల మహా పాదయాత్ర సాగుతుందని వివరించారు.

మహిళా సాధికారతే లక్ష్యం

పంజగుట్ట: మహిళా సాధికారతే లక్ష్యంగా ఆల్ ఇండియా మహిళా ఎంపవర్మెంట్ పార్టీని ప్రజల ముందుకు తీసుకువచ్చినట్లు పార్టీ కోర్ కమిటీ హెడ్ వరప్రసాద్ తెలిపారు. మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలనే హీరా గ్రూప్ అధినేత నౌహిరా షేక్ పార్టీని స్థాపించి ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి నిలబెట్టారన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ..2017లో స్థాపించిన పార్టీ కర్నాటక ఎన్నికల్లో 224 స్థానాల్లో పోటీచేసి అత్యధికశాతం ఓట్లు సాధించిందని, మహారాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేసి ఎక్కువ సంఖ్యలో సర్పంచ్‌లను గెలుచుకుందని గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో తెలంగాణలో 119 స్థానాల్లో అభ్యర్థులను బరిలోకి దించుతామన్నారు.

నూతన విద్యావిధానం అమలుకు శిక్షణ

రాయదుర్గం: జాతీయ నూతన విద్యావిధానం అమలు కోసం ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నట్టు న్యూఢిల్లీ సంస్కృత ఫౌండేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ చంద్‌కిరణ్ సలూజా పేర్కొన్నారు. మంగళవారం ఉర్దూ విశ్వవిద్యాలయంలో స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ నిర్వహించిన ఇంటిగ్రేటెడ్ టీచర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ (ఐటీఈపీ), 'అన్‌వైలింగ్ న్యూ హారిజన్స్ ఇన్ టీచర్ ఎడ్యుకేషన్: ప్రాస్పెక్ట్స్ అండ్ ఛాలెంజెస్' అనే అంశంపై ఒక రోజు సదస్సు నిర్వహించారు. పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ చంద్‌కిరణ్‌సలూజా మాట్లాడారు. వీసీ సయ్యద్ ఐనుల్ హసన్ మాట్లాడుతూ నూతన విద్యావిధానం సహకార స్ఫూర్తిని పెంపొందిస్తుందన్నారు. అనంతరం సలూజాతో కలిసి వైస్‌చాన్స్‌లర్ ఉర్దూ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో మొక్కలు నాటారు.



ప్రొ.చంద్‌కిరణ్‌కు పూలమొక్కను అందిస్తున్న వీసీ ఐనుల్ హసన్